# ఉభయ విద్యా ప్రౌఢి కూచిపూడి పి.వి.జి

- డా॥ వేదాంతం రామలింగశాస్త్రి

అనుబంధం ఉన్న రెండువిద్యలు ఒక్కచోట పెన వేసుకుంటే అందం, అదే సహృదయప్రేక్షకులకు ఆనందం; లలితకళలు ఒకదానికొకటి అల్లుకుపోయే గుణమున్నవి కాబట్టే సమాహార కళలుగా వాటిని మనం గౌరవిస్తాం. కళాకారులు కూడా ఒకటిని మించి కళలను కల్గివుంటే గౌరవార్హులుగా మరింత రాణిస్తారు. ఇలాంటివారు నేడు అరుదైనా ముందు తరాలవారిలో ఎంతోమంది కనిపిస్తారు. వారిలో అగ్రగణ్యులు కూచిపూడి కులపతి కీ॥శే॥ పసుమర్తి వేణుగోపాలకృష్ణశర్మ.

కూచిపూడి కళామాగాణంలో అలుపెరుగని కృషీవలుడు పి.వి.జి.గా పిలువబడే కృష్ణశర్మగారు. శ్రీకృష్ణప్రియమైన గానకళ, నటరాజ ప్రియమైన నాట్యకళలు కృష్ణాష్టమినాడు కూచిపూడిలో జన్మించిన వీరికి- అలంకారాలైనాయి., కాదు కాదు ఇంటివిద్య వొంటబట్టి తండ్రి తాతలను మించిన ఘనుడిగా వెలుగొంది ఈయన సంగీత నాట్యాలకు అలంకారప్రాయులైనారు.

సంగీత విద్యను ఔపోసన పట్టిన మేటివారలెందరో వున్నా, తాను పొందిన గానకళకు రసాన్ని, భావాన్ని అద్ది- అప్పుడు కల్గే మాధుర్యాన్ని రుచి- చూపడం; నేర్చిన నర్తన విద్యకు సొబగు జిలుగులను జేర్చి అందులోని సౌకుమార్యాన్ని అందించడం ఆంధ్రకళా ప్రేక్షకులకీయన చేసిన మహోపకారం. ప్రయోగాలకు ప్రయోజనం చేకూర్చిన మహాకళాకారులు పి.వి.జి.

గాయకులుగా, సంగీతాచార్యులుగా; నర్తకులుగా, నాట్యాచార్యులుగా; ఉపాధ్యాయులుగా, మహామహో పాధ్యాయులుగా; ప్రయోక్తగా, సూత్రధారులుగా; కూచిపూడికి వీరు పరమేశ్వరుడందించిన వరం. నాటి తరానికీ- నవ్యయుగానికీ మార్గనిర్దేశకులుగా పి.వి. జి. కృషి శ్లాఘనీయం. సంస్తూయమానం. 2012- తనలో ఐక్యంచేసుకొని-అంతులేని లోకాలలో ఎచ్చటికో తీసుకుపోయిన వీరిగురించి భావితరాలు తెలుసుకోవలసిన అవసరం వుంది.

27-8-1929లో పసుమర్తి అన్నపూర్ణమ్మ ఆంజనేయశర్మ దంపతులకు కూచిపూడి కళాగ్రామంలో జన్మించిన వీరు 'పువ్వు పుట్టిన తోడనే- పరిమళిస్తుం'దన్నట్లు అతి పిన్నవయసులోనే కళకు దగ్గరయ్యారు. తన ఐదవ యేటనే మేనమామ గారైన కీ॥శే॥ వేదాంతం పార్వతీశం వద్ద నర్తన విద్యకు ఓనమాలు దిద్దారు. పార్వతీశం గారిది నిబద్ధత తో కూడుకొన్న గురుకులం. బహుశః పి.వి.జి తోటివారితో పార్వతీశం' గురుత్వంలో సాగిన మొదటి శిష్యవర్గం. శ్రీ చింతా సీతారామాంజనేయులు, శ్రీ పసుమర్తి సీతారామయ్య, కీ॥శే॥ మహంకాళి శ్రీరాములు, కీ॥శే॥ ఏలేశ్వరపు నాగేంద్రశర్మ, కీ॥శే॥ భాగవతుల రామతారకం, శ్రీ పసుమర్తి వెంకటేశ్వర్లు మొ॥వారు పి.వి.జి.కి ఆనాడు సహాధ్యాయులు.

ప్రతిరోజూ నర్తనాభ్యాసానికి ముందు సాము గరిడీలలో భాగంగా దండేలు, కుప్పీలు, ఆసనాలు, బస్కీలు చేయించిన పిమ్మట నర్తనంలోని అడుగు- సాములు, ఆర్దీలు, తీరులు, తీర్మానాలు, జతులు ఆపైన శబ్దాల వంటి వ్యస్తాంశాలు నేర్పేవారట పార్వతీశంగారు. సానుకూలంగా, కష్టమైనా ఇష్టంగా నేర్చుకొనే పి.వి.జి.ని చూచి ముచ్చటపడేవారట ఆనాటి పెద్దలు. ఇలా నాల్గైదేళ్ళు గడిచాయి, కీ॥శే॥ ఏలేశ్వరపు సీతారామాంజనేయులు వద్ద సంగీతాన్నీ ప్రారంభించారు- అక్కడా అంతే. ఎంతో శ్రద్ధా, భక్తులు కనబరచే వీరంటే ఏలేశ్వరపువారికి ముచ్చట. సరళీస్వరాలు, జంటస్వరాలు, దాటుస్వరాలు, అలంకారాలు, గీతాలు, వర్ణాలు ఇలా ఏవైనా సరే నేర్చుకున్న అన్నింటినీ ప్రతిరోజూ



Kuchipudi Final Setting 2014.indd 25 12/23/2014 10:42:47 PM



షట్కాలాల్లోనూ పాడటమేకాక అకార సాధననూ అమితంగా చేసేవారట అందుకేనేమో వీరిగళంలో సంగీతపు రవ్వలు కోకొల్లలనేవారట సాటివారంతా.

ఐతే సంగీతసాధనమూలంగా నర్తనానికేనాడూ ఆటంకం రాకుండా జోడు విద్యలనూ జ్యోతుల్లాగానే వెలిగించుకున్నారీయన. ప్రాథమిక నర్తన విద్యను అంటే శబ్దాలూ, కీర్తనలు, జతిస్వరాలూ, తిల్లానాలు, పదాలు, జావళీలు,–తరంగాలు, అష్టపదులు ఇలా వ్యస్తాంశాలను నేర్చుకొంటూ పార్వతీశం నేతృత్వంలో ప్రదర్శనలనిస్తూ రాణిస్తున్న వీరిపై ''యక్షగాన శిరోమణి'' శ్రీచింతా వెంకట్రామయ్య దృష్టిపడి యక్షగాన విద్యాభ్యాసానికి దారితీసిందట. హరిశ్చంద్రీయం, గయోపాఖ్యానం,



Kuchipudi Final Setting 2014.indd 26 12/23/2014 10:42:50 PM

రామనాటకం, ప్రహ్లాదనాటకం, ఉషాపరిణయం, మోహినీ రుక్మాంగద మొ॥ వాటిని నేర్పడం, భామ, గొల్ల కలాపాల్లో తీర్చి దిద్దటం జరిగిందట. ఇక్కడ ప్రత్యేకించి చెప్పుకొనవలసిన విషయం–పై యక్షగాన, నాటక, కలాపములను ఆయా పాత్రలన్నింటితో ఆసాంత ప్రదర్శననూ నేర్పడం నర్తనపరంగానే కాక పాడటంకూడా జరగడం విశేషం. అందరూ పాడలేరు, పాడుతూ ఆడలేరు. పి.వి.జి.కి విశేషంగా ఇది అబ్బడం ఆనాటి వారందరికీ చర్చనీయాంశమేనట.

ఏలేశ్వరు వారివద్ద కీర్తనలు, కృతులు, రాగాలాపనలు, స్వర పరచే విధానాలు నేర్పడం వీరి నాట్య విద్యాభ్యాసానికి మరింత వన్నె తెచ్చేదట. ఆనాడు పాత్రధారులు తమ పద్యాలను తామేపాడుతూ, తమ దర్వులను సూత్రధారులతో కలసి పాడుతూ నర్తించడం కద్దు. పి.వి.జీకీ విషయం మిగిలిన వారికంటే తేలికనిపించేదట. క్రమంగా సర్టిఫికెట్, డిప్లమో కోర్సులలో ఉత్తీర్ణులై లౌకిక విద్యలోనూ ముందువరుసలోనే ప్రతిభ కనబరచేవారట.

మతంగ కన్యగా హరిశ్చంద్రీయంలో స్త్రీ పాత్రనూ, సత్యకీర్తిగా పురుష పాత్రనూ కాలక్రమంలో పోషించారట. అంతకుముందు బాల్యంలో రామనాటకంలో కుశుడిగానూ, లవుడిగాను, అవసరాన్నిబట్టి, ప్రహ్లాదలో ప్రహ్లాదుడిగానూ బాగా రాణించారట. అర్జునుడిగా గయోపాఖ్యానంలోను, చిత్రలేఖగా ఉషాపరిణయంలోను... ఇలా ఆయా పాత్రల్లో నర్తించి పేరుపొందుతూనే సూత్రధారుల్లో ఒకరుగా వుంటూ పాటపై బాగా ఉత్సాహాన్ని చూపడంతో కొంతకాలానికి సూత్రధారునిగా రాణించసాగారట. శ్రీ చింతా వెంకట్రామయ్య కుమారులు శ్రీ చింతాకృష్ణమూర్తి గురుత్వంలో వీరికి ఆయా యక్షగాన నాటక, కలాపాల్లో సూత్రధార విద్య రాణింపు దశకు చేరుకొన్నదట. 1943కు ముందు యక్షగాన పాత్రలతోపాటు గోపిక, రాధ, రంగి వంటి పాత్రలు ధరించిన వీరికి కోమలత్వం స్వగుణంగా మారింది. 1943–నుండి 1948 వరకూ అటు పార్వతీశంగారితోనూ, ఇటు వేదాంతం వారి మేళంతోనూ సన్నిహిత సంబంధాలున్న వీరు, 1948 తరువాత కేవలం చింతామేళానికి పరిమితమైనారట. కృష్ణమూర్తిగారితో అనుబంధం బాగా యేర్పడి 'సూత్రధారుడి'గా రాణింపు దశకు రాసాగారట.

1950వ దశకంలో పి.వి.జి సంగీత పాఠాలను నేర్పుతూ, చుట్టు ప్రక్కల గ్రామాల్లోని హైస్కూళ్ళలో అధ్యాపకుడుగా పనిచేస్తూ, 1958 వ సం॥లో వేదాంతం పార్వతీశం స్థాపించిన లలితకళాక్షేత్రంలో సంగీతాచార్యులుగా చేరారట. ఈ సమయంలోనే కొంతకాలం మద్రాసునగరం వెళ్ళి కొందరు సినీతారలకు నృత్యం నేర్పేవారట కీ॥శే॥ శ్రీ వేదాంతం రాఘవయ్య ప్రేరణతో. కానీ ఆ వాతావరణం సనాతన ధర్మాలను గౌరవించే వీరికి నచ్చక మరల కూచిపూడికే వచ్చేశారు. 1962 లో పార్వతీశం లలితకళాక్షేత్రం శ్రీ సిద్ధేంద్రకళాక్షేత్రంగా మార్పునొంది బందా కనకలింగేశ్వర రావుగారి ప్రాపకంతో ఎదిగింది. అందులోనూ పి.వి.జి పాత్ర శ్లాఘనీయంగానే సాగింది.

**ప్రధానాచార్యులుగా శ్రీ.పి.వి.జి :–** కీ॥శే॥ చింతా కృష్ణమూర్తి తరువాత కొంతకాలం పద్మశ్రీ డా॥ వేదాంతం సత్యనారాయణశర్మ ప్రధానాచార్యులుగా పనిచేసినా వారి నాట్యప్రదర్శనలకు అంతరాయం కల్గటంతో 1972లో ఆ పదవి పి.వి.జిని వరించింది. అసలు సూత్రధారి పార్వతీశం ఆరోగ్యలోపంతోనేమి, కొందరి అనాదరణతో నేమి కళాక్షేత్రానికి దూరమైనా శ్రీ పి.వి.జి. సేవలు పార్వతీశంగారి మెప్పుదలకు నోచుకొనడం విశేషం. ప్రధానాచార్యులుగా వీరు సంగీతాన్ని నేర్పుతూ విద్యార్థులను కొన్ని యక్షగానాల్లోనూ తర్ఫీదునివ్వసాగారు.

కీ॥శే॥ వేదాంతం సీతారామశాస్త్రి కూడా పార్వతీశం శిష్యరత్నమే. పి.వి.జి వలెనే వీరూ సంగీతనాట్యాచార్యులే. వీరిర్వురి సూత్రధారత్వంలో ప్రహ్లాదనాటకం రూపుదిద్దుకొంది. దర్శకత్వం ప్రధానంగా పి.వి.జి నిర్వహించగా అప్పటికే పార్వతీశం శిష్యులైన కీ॥శే॥ వేదాంతం రత్తయ్యశర్మ హిరణ్య కశ్యపునిగా, పసుమర్తి రత్తయ్యశర్మ లీలావతిగా, కీ॥శే॥ ప్రభల మురళీకృష్ణ నరసింహస్వామిగా, వేదాంతం రాధేశ్యాం ప్రహ్లాదునిగా ఇలా సిద్ధేంద్ర కళాక్షేత్రంలోని విద్యార్థినీ విద్యార్థులు చేత ఆయా మిగిలిన పాత్రలను ధరింపజేసి



Kuchipudi Final Setting 2014.indd 27 12/23/2014 10:42:50 PM

ప్రహ్లాద నాటకం రసరమ్యంగా రూపుదిద్దుకొంది ఎన్నో ప్రదర్శనలు ఆంధ్రావనిలోనే కాక ఢిల్లీదాకా పాకి శ్రీ పి.వి.జి కీర్తి ఎదగసాగింది.

నాట్యగురువుగా పి.వి.జి :– కీ॥శే॥ ప్రహ్లాదశర్మగారి శిష్యరికంలో చక్కటి నర్తకులుగా పేరొందిన శ్రీయుతులు రాజారెడ్డిరాధారెడ్డి దంపతులు. పి.వి.జి వద్దకు ప్రహ్లాదశర్మ పంపగా వచ్చి కొంతకాలం కూచిపూడిలోనే ఉండి కొన్ని మెళకువలు నేర్చుకొన్నారు. యామినీ కృష్ణమూర్తి కూడ కొంతకాలం వీరిని ఆశ్రయించిన వారే. కీ॥శే॥ మహంకాళి మోహన్, కీ॥శే॥ మాచేస్వరావు, శ్రీ వేదాంతం రాధేశ్యామ్, శ్రీ చింతా ఆదినారాయణశర్మ, శ్రీ పసుమర్తి కేశవప్రసాద్, లంకా అన్నపూర్ణ, వసంతలక్ష్మీ నరసింహాచార్యులు, కిలాంబి రాజకుమారి, మైసూర్‌నందిని, కీ॥శే॥ డా॥ చింతా రామనాథం, పసుమర్తి శేషుబాబు, శ్రీనివాసులు, పాండురంగవిఠల్ మొ॥ వారు వీరి శిష్యులే. ఆశ్రయించిన విద్యార్థులకు నాట్యవిద్యతోపాటు అందులోని మెళకువలు, భరతశాస్త్రమును శ్లోకసహిత భట్టీయ సంగీతములు కూడా చెప్పడం పి.వి.జి గురుత్వం.

ప్రయోక్తగా పి.వి.జి :– కీ॥శే॥ వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించిన రహస్యం చలనచిత్రంలో గిరిజా కల్యాణ ఘట్టాన్ని కూచిపూడి ఫక్కీలో తెరకెక్కించారు. అది సినిమాలో కావడంచేత చాల తక్కువ నిడివితో సాగింది. శ్రీ పి.వి.జికి దీనిని ఒక యక్షగానంగా చేయించాలనే తలంపు మెదిలింది. దాపునగల వడాలి గ్రామానికి చెందిన కీ॥శే॥ దండిభొట్ల వేంకటశాస్త్రి సంగీత సాహిత్య విద్వన్మణులు. గొప్ప హరికథకులున్నూ. వీరూ, పి.వి.జి ఆప్తమిత్రులు. వేంకటశాస్త్రి పి.వి.జి కోరిక మేరకు పార్వతీ పరిణయం పేరుతో ఇలా శ్రీ పి.వి.జి సంగీత నాట్యాల గురుత్వ ప్రస్థానం సమర్థంగానే సాగినా ప్రభుత్వ ఆదరణ మాత్రం కొరతగానే మిగిలింది. అయితే కొంత ఊరటగా 1987లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 2009లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 'సిద్ధేంద్ర ఆచార్య' పురస్కారం, 2010లో కేంద్ర సంగీత నాటక అకాడమీ 'ఠాగూర్' పురస్కారములతోపాటు కొన్ని స్వచ్ఛంద సంస్థల సన్మాన సత్కారాలు, స్వర్ణకంకణ సత్కారాలు, బహుయక్షగానజ్ఞులుగా 'లింకా' బుక్ ఆఫ్ వరల్డు రికార్డులో చేరికలు జరిగాయి.

ఆకాశవాణిలో కూచిపూడి యక్షగానాలను, నాటకాలను పాడటం ద్వారా కళాప్రియులగు శ్రోతలకు వాటిని అందుబాటులోకి తెచ్చారు. కీ॥శే॥ పద్మశ్రీ డా॥ వేదాంతం సత్యనారాయణశర్మ నాటకాలకు గాత్రసహకారాన్ని అందించారు, వందలాది సంగీత నాట్యాత్మక ప్రసంగాలను, ప్రయోగాత్మక ప్రసంగాలను అందించారు, విశ్వవిద్యాలయాల్లో అతిథి పాఠ్యగురువుగా సేవలందించారు. శశిరేఖాపరిణయం యక్షగానాన్ని చాలాకాలం తరువాత పునః ప్రవేశపెట్టారు, వ్యాసాలు, కీర్తనలు, ఖండికలు రచించారు. ఇలా ఎన్నో విధాలుగా కళామతల్లికి సేవలందించిన శ్రీ పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ 2012లో స్వర్గసీమ నధిరోహించారు.

కళాజగతికి వీరిసేవలు పాత్రస్మరణీయాలు, ఆదర్శవంతాలు, అనితర సాధ్యాలు, ఎక్కడవున్నా వారి ఆత్మ కూచిపూడి నాట్య సంగీత విద్యలపైనా, విద్యార్థిలోకంపైనా తిరుగాడుతూనే ఉంటుంది. కూచిపూడి నామోచ్చారణ జరిగిన తావులన్నింటిలోనూ వీరి నామసౌందర్యం గుబాళిస్తూనే వుంటుంది. కూచిపూడి విద్యకు వీరు తెచ్చిన వన్నెల పతాకం దిగ్దిగంతాలా రెపరెపలాడుతునే ఉంటుంది. వీరివంటి వారివల్లే ''కళకు–కళాకారులకు మరణం ఉండ''దనే నానుడి నిజమయ్యేది!

★★★



Kuchipudi Final Setting 2014.indd 28 12/23/2014 10:42:50 PM